రాకేశ్‌రెడ్డిని గెలిపిస్తే గ్రాడ్యుయేట్లకు న్యాయం

మణుగూరు టౌన్: ఓటు అభ్యర్థిస్తున్న నాయకులు

భద్రాచలం : వాకర్స్‌ను అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

టేకులపల్లి : సభా వేదికపై లక్కినేని, నాయకులు

మణుగూరు టౌన్, మే 20: నల్లగొండ, ఖమ్మం- వరంగల్ బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిని గెలిపిస్తే గ్రాడ్యుయేట్స్‌కు న్యాయం జరుగుతుందని జడ్పీటీసీ పోశం నర్సింహారావు అన్నారు. సోమవారం పీవీ కాలనీలోని భద్రాద్రి స్టేడియం, అంబేద్కర్ స్టేడియంలో మార్నింగ్ వాకర్స్‌ని కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉన్నత చదువులు చదివి ఉన్నత ఉద్యోగాన్ని వదిలి ప్రజా సేవకై వచ్చిన రాకేశ్‌రెడ్డి మండలిలో ప్రవేశిస్తే గ్రాడ్యుయేట్స్‌కు న్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ఒక బ్రోకర్‌గా అతనిపై ఎన్నో ఆరోపణలున్నాయని అలాంటి వారికి అవకాశం కల్పిస్తే గ్రాడ్యుయేట్స్‌కి అన్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ముత్యంబాబు, కూనవరం మాజీ సర్పంచ్ ఏనిక ప్రసాద్, మాజీ ఎంపీటీసీ వల్లభనేని రమణ, మణుగూరు టీబీజీకేఎస్ ఇన్‌చార్జి నాగెల్లి వెంకట్, నాయకులు మడి వీరన్నబాబు, అక్కి నర్సింహారావు, ఉప్పుతల రామారావు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం, మే 20: వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఏనుగుల రాకేశ్‌రెడ్డిని శాసన మండలికి పంపాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. సోమవారం పట్టణంలోని జూనియర్ కళాశాల క్రీడా మైదానం వద్ద వాకర్స్‌ను బీఆర్ఎస్ నాయకులు మానె రామకృష్ణ కలిసి ఓట్లను అభ్యర్థించారు. విద్యావంతుడికి బ్లాక్ మెయిల్ చేసే వ్యక్తులు, బెదిరించే వ్యక్తులకు మధ్య జరిగే యుద్ధమన్నారు. నాయకులు తుమ్మలపల్లి ధనేశ్వరరావు, ఆకోజు సునీల్, జంజం పట్టాభి, డానియోల్ ప్రదీప్, రామకృష్ణ, గురిజాల వెంకటేశ్వర్లు, హిమాం ఖాసీం, అంబటికిర్ర కృష్ణ, బూత్ కమిటీ సభ్యులు సుబ్బారావు, సమర్‌కముఆర్, రంజిత్, సలోమి, మరియమ్మ పాల్గొన్నారు.

కేటీఆర్ సభకు తరలిన పట్టభద్రులు

టేకులపల్లి, మే 20: ఉమ్మడి నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సోమవారం ఇల్లెందు సింగరేణి గ్రౌండ్‌లో జరిగిన గ్రాడ్యుయేట్ల సభకు మండలం నుంచి భారీ సంఖ్యలో గ్రాడ్యుయేట్లు తరలి వెళ్లారు. ఈ సభకు టీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరయ్యారు. బీఆర్ఎస్ నాయకులు లక్కినేని సురేందర్‌రావు, బొమ్మెర్ల వరప్రసాద్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి వెళ్లారు.

రామయ్యకు ముత్తంగి అలంకరణ

కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

భద్రాచలం, మే 20: భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో సోమవారం అంతరాలయంలోని మూలవరులకు బెంగుళూరు భక్తులు రూ. 30లక్షలతో తయారు చేయించి సమర్పించిన ముత్యాలు పొదిగిన ప్రత్యేక తొడుగులను ధరింపజేశారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామికి సుప్రభాతం పలికి, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం తదితర నిత్య పూజలను నిర్వహించారు. అనంతరం స్వామివారి నిత్య కల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకొచ్చి శాస్త్రోక్తంగా స్వామివారికి నిత్య కల్యాణం జరిపారు. కల్యాణంలో పాల్గొన్న దాతలకు స్వామివారి ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

గుండెలపై రామన్న చిత్రం

మాజీ మంత్రి కేటీఆర్‌తో కార్తీక్

ఇల్లెందు రూరల్, మే 20: అభిమానులు తన గుండెల్లో ఉన్న అభిమాన నాయకుడి రూపాన్ని ఛాతీ, చేతిపై పచ్చబొట్టు వేసుకుంటున్నారు. మండలంలోని లలితాపురం గ్రామానికి చెందిన ఇర్ప కార్తీక్, చల్లసముద్రం గ్రామ పంచాయతీ ఆంజనేయపురం గ్రామానికి చెందిన ఆంగోత్ మంగీలాల్‌లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ బొమ్మను తమ ఛాతిపై పచ్చబొట్టు వేసుకున్నారు. వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఇల్లెందులో జరిగిన సభకు వచ్చిన కేటీఆర్‌ను కలిసి పచ్చబొట్టును చూసి ఫొటో దిగారు.

కుంజా బేబిని సత్కరించిన ఎమ్మెల్యే

భద్రాచలం, మే 20: డాక్టరేట్ సాధించిన ఆదివాసి మహిళ కుంజా బేబిని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు సోమవారం సత్కరించారు. భద్రాచలం డీఈడీ కళాశాలలో లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ విభాగంలో ఆమె డాక్టరేట్ సాధించారు. కార్యక్రమంలో రత్నం రమాకాంత్, చింతాడి రామకృష్ణ, జాస్తి గంగా భారతి, పిట్టల లక్ష్మీకాంతం, కేతినేని లలిత, మాజీ ఎంపీటీసీ మానె కమల, కొర్సా జ్యోతి, ఒగ్గు అనురాధ, సీత, రసూల్‌బీ తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత ఉండాలి

మరుగుదొడ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీవో

పాల్వంచ రూరల్, మే 20: అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల్లో నాణ్యతా ప్రమాణాలు ఉండలని అదనపు కలెక్టర్/ డీఆర్‌డీవో విద్యాచందన అన్నారు. మండలంలోని పునుకుల, కోడి పుంజులవాగు, కిన్నెరసాని పంచాయతీల్లోని అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న పనులను సోమవారం ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డితో కలిసి పరిశీలించారు. పాఠశాలలను తెరిచే నాటికి అన్ని పనులు పూర్తికావాలన్నారు. ఆయా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు పూర్తి స్థాయిలో ఉండాలన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏపీవో పోరండ్ల రంగా, ఏపీఎం రాంబాబు పాల్గొన్నారు.

రామాలయంలో సుదర్శన హోమం

భద్రాచలం, మే 20: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో సోమవారం చిత్తా నక్షత్రాన్ని పురస్కరించుకొని యాగశాలలో అర్చకులు సుదర్శన హోమం నిర్వహించారు. తొలుత యాగశాలలో విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచన జరిపి, సుదర్శన జపం, సుదర్శన శతకం, సుదర్శన అష్టకం తదితర కార్యక్రమాలతో హోమం నిర్వహించి, పూర్ణాహుతి జరిపారు. పట్టు వస్త్రం, హోమ ద్రవ్యాలు హోమగుండానికి సమర్పించారు.

పిడుగుపాటుకు పది ఆవులు మృతి

పాల్వంచ రూరల్, మే 20: పిడుగుపాటుకు పది ఆవులు మృతిచెందాయి. మండలంలోని రేగులగూడెం పంచాయతీ రాళ్ళచెలక గ్రామ రైతులు పద్దం లక్క, మడకం జోగా, మడివి లక్క కు చెందిన పశువుల మంద సోమవారం గ్రామ శివార్లలో మేతకు వెళ్లింది. సాయంత్రం వేళ ఉరుములతో కూడిన వర్షంతో కూడిన వర్షం కురిసింది. ఆవుల మందపై పిడుగు పడింది. మందలోని పది ఆవులు మృతి చెందాయి.

తమ్ముడిపై అన్న దాడి

పాల్వంచ రూరల్, మే 20: తమ్ముడిపై అన్న దాడి చేశాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని నాగారం ఎస్సీ కాలనీకి చెందిన సోదరులు నరుకుడు పెద్దిరాజు, నరుకుడు దుర్గా ప్రసాద్ మధ్య కొద్ది రోజుల నుంచి డబ్బు విషయమై గొడవలు జరుగుతున్నాయి. వీరిద్దరూ సోమవారం ఘర్షణకు దిగారు. తమ్ముడు దుర్గాప్రసాద్‌పై కర్రతో అన్న పెద్ది రాజు దాడి చేశాడు. దుర్గాప్రసాద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడి ఫిర్యాదుతో రాజుపై కేసు నమోదైంది.

లిటిల్ ఫ్లవర్స్ హైస్కూల్ నందు SC, ST విద్యార్థులకు ఉచిత ప్రవేశ ప్రకటన
2024-2025 విద్యా సంవత్సరమునకుగాను
(SC విద్యార్థులకు) 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు
(పుట్టిన తేదీ : 01-06-2018 నుండి 31-05-2019)
5వ తరగతి నుండి 10వ తరగతి వరకు
ST విద్యార్థులకు హాస్టల్ వసతి
3వ తరగతి నుండి 10వ తరగతి వరకు
5వ తరగతి నుండి 10వ తరగతి వరకు
8వ తరగతి నుండి 10వ తరగతి వరకు
గమనిక : మీ సేవ ద్వారా జారీ చేయబడిన కులం, ఆదాయం మరియు నివాస ధృవీకరణపత్రం సమర్పించవలెను.
అప్లికేషన్ చివరి రోజు : 05-06-2024
మరింత సమాచారం కోసం
లిటిల్ ఫ్లవర్స్ హైస్కూల్, భద్రాచలం
సెల్ : 9618001900, 7981828427

వివరాలు వెల్లడించిన భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్ రాజు

లొంగిపోయిన ముగ్గురు మావోయిస్టులు


లొంగిపోయిన మావోయిస్టుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రోహిత్ రాజు

కొత్తగూడెం క్రైం, మే 20: మావోయిస్టు పార్టీ, సిద్ధాంతాలపై నమ్మకం కోల్పోయిన నాయకులు, సభ్యులు జనజీవన స్రవంతిలో కలుస్తున్నారని, ఇందులో భాగంగా ఇద్దరు ఏరియా కమిటీ సభ్యులు, ఒక గ్రామ కమిటీ ఇంఛార్జ్ లొంగిపోయాడని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ బిరుద రాజు రోహిత్‌రాజు తెలిపారు. వివరాలను ఎస్పీ తన కార్యాలయంలో సోమవారం విలేకరులకు వెల్లడించారు. మావోయిస్టు పార్టీ ఏటూరునాగారం-మహదేవ్‌పూర్ ఏరియా కమిటీ సభ్యుడు కోవాసి గంగా అలియాస్ మహేశ్ అలియాస్ జనార్దన్, అతడి భార్య సోడి ఉంగి అలియాస్ ఝాన్సీ(ఏసీఎం), డీఏకేఎంఎస్ ఇంఛార్జ్ కలుమ బుద్ర స్వేచ్ఛా జీవనాన్ని గడిపేందుకు వచ్చి జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు తెలిపారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా కిష్టారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని నిమ్మలగూడకు చెందిన మహేశ్ 2009లో మావోయిస్టు పార్టీ చర్యలకు ఆకర్షితుడై ఏటూరునాగారం-మహదేవ్‌పూర్ ఏరియా కమిటీలో మిలీషియా సభ్యుడిగా చేరి 2015లో పదోన్నతి పొందాడని తెలిపారు. అదే ప్రాంతానికి చెందిన ఝాన్సీ 2019లో అదే కమిటీలో దళ సభ్యురాలిగా చేరి, ఆ కమిటీ సభ్యుడిగా పని చేస్తున్న మహేశ్‌ను వివాహం చేసుకుంది. కలుమ బుద్ర తన చిన్నతనంలోనే 2002లో మావోయిస్టు పార్టీలో మిలీషియా సభ్యుడిగా చేరి, ఏడాది తర్వాత చైతన్య నాట్య మండలి (సీఎన్ఎం)లో పదేళ్లు కళాకారుడిగా, గాయకుడిగా పని చేశాడు. ప్రస్తుతం పుట్టపాడు డీఏకేఎంఎస్ అధ్యక్షుడిగా పని చేస్తున్నట్లు తెలిపారు. వీరంతా మావోయిస్టు పార్టీలో పద్ధతులు, సిద్ధాంతాలపై విరక్తి చెంది జన జీవనంలోకి అడుగు పెట్టాలని నిర్ణయించుకున్నారని స్పష్టం చేశారు. ఈ మేరకు జిల్లా పోలీస్ అధికారులు, సీఆర్‌పీఎఫ్ అధికారుల ఎదుట లొంగిపోయినట్లు ఎస్పీ వివరించారు. అనంతరం లొంగిపోయిన మావోయిస్టులకు ఎస్పీ రోహిత్ రాజు ప్రోత్సాహక నగదు అందజేశారు. కార్యక్రమంలో భద్రాచలం ఏఎస్పీ పరితోశ్ పంకజ్, సీఆర్‌పీఎఫ్ 141 బెటాలియన్ అదనపు కమాండెంట్ కమల్‌వీర్ యాదవ్, 81 బెటాలియన్ అదనపు కమాండెంట్ కన్వార్, చర్ల సీఐ ఆలెం రాజువర్మ, ఎస్సై టీవీఆర్ సూరి, పీఆర్వో దాములూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆటో యూనియన్ అడ్డా ఏర్పాటు

పర్ణశాల, మే 20: స్థానిక శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం వద్ద ఆటో యూనియన్ అడ్డాను ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా పానుగంటి శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా పిల్లి సుబ్రహ్మణ్యం, కార్యదర్శిగా తంతరపల్లి నాగేశ్వరరావును ఎన్నుకున్నారు. ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

మణుగూరు టౌన్, మే 20: ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తతో ఉండాలని ఎస్సై మేడా ప్రసాద్ అన్నారు. సోమవారం పట్టణంలో ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ... టెక్నాలజీ అభివృద్ధి చెందుతున్న తరుణంలో అపరిచిత ఫోన్ కాల్స్, మెసేజ్‌ల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. వ్యక్తిగత బ్యాంక్ వివరాలు అపరిచితులతో పంచుకోరాదన్నారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు డయల్ చేయాలన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు శాంతి, తదితరులు ఉన్నారు.

కర్రల ట్రాక్టర్ సీజ్

జూలూరుపాడు, మే 20: కర్రల ట్రాక్టర్‌ను అటవీ అధికారులు సీజ్ చేశారు. జూలూరుపాడు ఎఫ్ఆర్‌వో ప్రసాదరావు తెలిపిన వివరాలు.. మండలంలోని పడమటనర్సాపురం గ్రామ రైతు కిషన్, కూరగాయల పాదుల్లో మొక్కలకు ఆధారంగా పెట్టేందుకు పాపకొల్లు బీట్‌లోని చీమలపాడు ఫారెస్ట్‌కు ఆదివారం రాత్రి కూలీలతో కలిసి వెళ్లాడు. సుమారు 160 కర్రలను నరికి గుండ్ల రేవు గ్రామానికి చెందిన శాంతి ట్రాక్టర్‌లో లోడ్ చేసుకుని వస్తున్నాడు. ఈ సమాచారంతో అటవీశాఖ అధికారులు మల్లయ్య, కిషన్, వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి కలిసి కాపుగాచి పట్టుకున్నారు. ఈ కర్రల విలువ రూ.21వేలు ఉంటుంది. ట్రాక్టర్‌ను సీజ్ చేసి, కేసు నమోదు చేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

జూలూరుపాడు, మే 20: స్థానిక జిల్లా పరిషత్ సెకండరీ స్కూల్‌లోని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. వీటిలోని వసతులను సెక్టార్ ఆఫీసర్ అశోక్‌కుమార్ సోమవారం పరిశీలించారు.

ఎమ్మెల్యే పరామర్శ

చంద్రుగొండ, మే 20: మండలంలోని బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సోమవారం పరామర్శించారు. ఆదుకుంటానని హామీ ఇచ్చారు. నాయకులు అంకిరెడ్డి కృష్ణారెడ్డి, సారేపల్లి శేఖర్, సంకా సంకర్, ఇస్లావత్ రుక్మిణి, బగుగు కృష్ణవేణి, దారం గోవిందరెడ్డి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

చంద్రుగొండ, మే 20: విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందింది. మండలంలోని గుర్రాయిగూడెం గ్రామ రైతు కాకా కృష్ణయ్యకు చెందిన సూడి ఆవు సోమవారం ఉదయం చేనుల్లో మేతకు వెళ్లింది. అక్కడ తక్కువ ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో వైర్‌కు అవు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. దీని విలువ రూ.70వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

విద్యుత్ వైర్లు తగిలి బాలుడికి గాయాలు

అశ్వాపురం, మే 20: డాబాపై ఆడుకుంటున్న బాలుడికి విద్యుత్ తీగలు తగిలి గాయపడిన ఘటన మండలంలోని అమెర్ద గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. ఆమెర్ధ గ్రామానికి చెందిన ఇరుగు నాగరాజు చిన్న కుమారుడు విఘ్నేష్ డాబాపై ఆడుకుంటుండగా డాబాపై నుంచి వెళ్లిన 11కేవీ విద్యుత్ వైర్లు తగిలి షాక్‌కు గురయ్యాడు. కుటుంబ సభ్యులు వెంటనే బాలుడిని భద్రాచలంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.

'నిబంధనలు అతిక్రమించొద్దు'

టేకులపల్లి, మే 20: మీసేవ నిర్వాహకులు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ తహసీల్దార్ పీ ముత్తయ్య హెచ్చరించారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మీసేవ సెంటర్‌కు వచ్చిన వారి నుంచి సరైన ఆధారాలు తీసుకొని దరఖాస్తులో పూర్తి వివరాలతో ఆన్‌లైన్ చేయాలన్నారు. ఫ్యామిలీ మెంబర్ తదితర సర్టిఫికెట్లకు డబ్బులు ఎక్కువ వసూలు చేసి త్వరగా ఇప్పిస్తామని లబ్ధిదారులను మభ్యపెడుతున్నారని, ప్రజలు వాటిని నమ్మొద్దన్నారు.

రైతును తిట్టి, బెదిరించిన నలుగురిపై కేసు

అశ్వారావుపేట, మే 20: రైతును దుర్భాషలాడిన నలుగురిపై కేసు నమోదైంది. ఏఎస్సై యాకూబ్ అలీ తెలిపిన వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడేనికి చెందిన రైతు సాలూరి సత్యనారాయణకు అశ్వారావుపేట మండలం తిమ్మాపురం వద్ద మామిడి తోట ఉంది. ఈ నెల 18న తన తోటలోకి వెళ్తున్న ఆయనను ఏలూరి జిల్లా జీలుగుమిల్లి మండలానికి చెందిన సూర్యకుమారి, రమణ, విజయ్‌కాంత్, అప్పారావు అడ్డుకుని దుర్భాషలాడి, బెదిరించారు. బాధిత రైతు ఫిర్యాదుతో కేసు నమోదైంది. దర్యాప్తు సాగుతున్నది.

బెస్ట్ అవైలబుల్ ప్రవేశాలకు దరఖాస్తులు

భద్రాచలం, మే 20: భద్రాచలం 2024-25 విద్యా సంవత్సరానికి బెస్ట్ అవైలబుల్ పథకం ద్వారా జిల్లాకు చెందిన అర్హులైన గిరిజన విద్యార్థినీ, విద్యార్థులు 3,5,8 తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడవ తరగతిలో 61సీట్లు, 5వ తరగతిలో 30 సీట్లు, 8వ తరగతిలో 30సీట్లు మొత్తం 121సీట్లు ఉన్నాయని, ఆసక్తి కలిగిన వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను సహాయ గిరిజన సంక్షేమ అధికారి దమ్మపేట, భద్రాచలం, ఇల్లెందు కార్యాలయాల నుంచి కానీ, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ, ఐటీడీఏ భద్రాచలం నుంచి కానీ పొందవచ్చన్నారు. దరఖాస్తులను కులం, నివాసం, గ్రామీణ ప్రాంత తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.1.50లక్షల లోపు, పట్టణ ప్రాంతాల వారు ఆదాయం రూ. 2లక్షల లోపు కలిగి ఉన్న వారు మీ సేవ ధృవీకరణ పత్రాలు జతచేసి, జూన్ 6వ తేదీలోపు డీడీ గిరిజన సంక్షేమ శాఖ, భద్రాచలంలో సమర్పించాలన్నారు. జూన్ 12న లాటరీ తీస్తారన్నారు.

వాసవీక్లబ్ గ్రేటర్, వనిత వాసవీక్లబ్ కార్యవర్గ ప్రమాణం

వాసవీక్లబ్ గ్రేటర్, వనిత వాసవీక్లబ్ నూతన కార్యవర్గం

సారపాక, మే 20: సారపాకలోని వాసవీ ఫంక్షన్‌హాల్‌లో సారపాక వాసవీ క్లబ్ గ్రేటర్, వనిత వాసవీ క్లబ్ నూతన కమిటీ సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. వాసవీక్లబ్ వీ106ఏ గవర్నర్ గుమ్మడవల్లి శ్రీనివాసరావు, దోసపాటి వెంకటేశ్వరరావులు హాజరై నూతన కమిటీచే ప్రమాణ స్వీకారం చేయించారు. సారపాక వాసవీక్లబ్ గ్రేటర్ అధ్యక్షుడిగా పచ్చిపులుసు మనోజ్‌కుమార్, కార్యదర్శిగా కంటాల రాజేశ్, కోశాధికారి శిఖాకొల్లి పవన్‌కుమార్, వాసవీ వనిత క్లబ్ అధ్యక్షురాలిగా ఊటుకూరు స్వరూపరాణి, కార్యదర్శిగా పాలెపు హిమబిందు, కోశాధికారిగా ఆలపాటి హిమజ, కమిటీ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం నూతన కార్యవర్గం క్యాన్సర్‌తో బాధపడుతున్న స్వరాజ్యలక్ష్మికి వైద్యఖర్చుల నిమిత్తం క్లబ్ నుంచి రూ.25,816, పాల్వంచ చలవాది ప్రకాశ్ ట్రస్టు నుంచి రూ.8వేలు క్లబ్ గవర్నర్‌ల చేతులమీదుగా బాధితురాలికి అందజేశారు. కార్యక్రమంలో క్యాబినెట్ సెక్రటరీ రాధాకృష్ణమూర్తి, క్యాబినెట్ ట్రెజరర్ మాశెట్టి వరప్రసాద్, వైస్ గవర్నర్ దారా నర్సింహారావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ దారా మల్లికార్జునరావు, ఆర్‌సీ విశ్వనాథ్‌గుప్తా, జడ్‌సీ రేపాక శ్రీనివాసరావు, డిస్ట్రిక్ట్ ఆఫీసర్లు పచ్చిపులుసు వెంకటసుబ్బారావు, భూమా వెంకట చంద్రశేఖర్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

పుస్తకాలను అందజేస్తున్న ఏరియా జీఎం జాన్ ఆనంద్

ఇల్లెందు రూరల్, మే 20: యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ అన్నారు. సోమవారం ఏరియాలోని సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రంథాలయానికి నూతన పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువతకు ఉపయోగపడే విధంగా గ్రంథాలయంలో నూతన పుస్తకాలను ఏర్పాటు చేశామన్నారు. ఉద్యోగులు, మాజీ ఉద్యోగుల పిల్లలతో పాటు పట్టణంలోని నిరుద్యోగ యువత వీటిని సద్వినియోగం చేసుకుంటూ పోటీ పరీక్షలకు సిద్దమయ్యేలా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటూజీఎం మల్లారపు మల్లయ్య, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, డీజీఎం సివిల్ రవికుమార్, అధికారులు సాయి స్వరూప్, గుర్తింపు సంఘం నాయకులు అజ్మీర కిషోర్, ఉద్యోగులు బాలాజీ, సాంబయ్య పాల్గొన్నారు.

సోలార్ కార్మికులకు వేతనాలు అందజేయాలి

ఇల్లెందు రూరల్, మే 20: సోలార్ ప్లాంటులో పనిచేస్తున్న కార్మికులకు నెలసరి వేతనాలను సమయానికి అందజేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బీ మధు అన్నారు. సోమవారం ఇల్లెందులోని సోలార్ ప్లాంటులో ప్లాంట్ అధ్యక్షుడు జీ ప్రేమ్ సింగ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేతనాలపై ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్‌తో మాట్లాడామని ఆయన త్వరలోనే హైదరాబాద్‌లోని ఆర్ఎల్‌సీ చర్చలలో పర్సనల్ డిపార్ట్‌మెంట్ మోహన్‌రావు, ఇంజినీర్ వీరునాయక్‌లను పంపించి కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. జిల్లా కార్యదర్శి అబ్దుల్ నబి, కమిటీ సభ్యులు తాళ్లూరి కృష్ణ, సోలార్ ప్లాంట్ కార్మికులు రాజ్‌కుమార్, శంకర్, హరికిషన్, శ్యాంబాబు, రాజ్‌కుమార్, వీరేందర్, కిరణ్, ఉపేందర్, కళ్యాణ్, రమేశ్, వెంకటేశ్, నవీన్, శివలాల్, సంతోష్, సతీష్, వినోద్ పాల్గొన్నారు.

ముత్యాలమ్మ బొడ్రాయి వార్షికోత్సవ వేడుకలు

సారపాక, మే 20: సారపాకలోని ముత్యాలమ్మపేటలో గల ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ బొడ్రాయి తృతీయ వార్షికోత్సవ వేడుకలను సోమవారం వైభవంగా నిర్వహించారు. మహిళలు బొడ్రాయి వద్ద బిందెలతో జలాభిషేకం నిర్వహించారు. అర్చకులు ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. ఆలయకమిటీ నిర్వాహకులు భక్తులకు పులిహోర, చక్కెరపొంగళి, దాతలు మజ్జిగ పంపిణీ చేశఋూరు. ఆలయకమిటీ నిర్వాహకులు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్చరీ సామగ్రి అందజేత

ఆర్చరీ సామగ్రి అందిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల

కొత్తగూడెం టౌన్, మే 20: పాల్వంచ మినీ స్టేడియంలో జిల్లా యువజన, క్రీడల శాఖ నిర్వహిస్తున్న ఖేలో ఇండియా ఆర్చరీ (విలు విద్య) శిక్షణ కేంద్రానికి రూ.3.50 లక్షల విలువైన రీకర్వ్ బౌ(యూఎస్ఏ మేడ్ హోటీ బ్రాండ్)ని కలెక్టర్ ప్రియాంక ఆల అందజేశారు. దీనిని కోచ్ కల్యాణ్ అందుకున్నారు. జిల్లా యువజన క్రీడల అధికారి పరంధామరెడ్డి, సూపరింటెండెంట్ ఉదయ్‌కుమార్, సీనియర్ క్రీడాకారుడు లక్ష్మణ్ పాల్గొన్నారు.

25న ఇంటర్ అడ్మిషన్ కౌన్సిలింగ్

పాల్వంచ రూరల్, మే 20: కిన్నెరసాని గిరిజన గురుకుల కళాశాలలో ఈ నెల 25న అడ్మిషన్ కౌన్సిలింగ్ ఉంటుందని ప్రిన్సిపాల్ ఆర్.గోవర్దన్ ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతి పాసైన ఎస్టీ, ఎస్సీ, బీసీ, ఓసీ విద్యార్థులు ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ, ఎంఈసీ తదితర గ్రూపుల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా విద్యార్థులు మెమో, టీసీ, స్టడీ, కండక్ట్, కుల, ఆదాయ ధ్రువపత్రాలు, ఆధార్ కార్డ్ జిరాక్స్, నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో కిన్నెరసాని గురుకులంలో ఈ నెల 25న అడ్మిషన్ కౌన్సిలింగ్‌కు ఉదయం 9.00 గంటల వరకు హాజరుకావచ్చని వివరించారు.

23న ఇంటర్‌లో ప్రవేశాలకు స్పాట్ కౌన్సిలింగ్

భద్రాచలం, మే 20: భద్రాచలం గిరిజన గురుకుల కళాశాలలో ఈ నెల 23న ఇంటర్‌లో ప్రవేశాల కోసం స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ మెండెం దేవదాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, ఒకేషనల్ గ్రూపుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. 23వ తేదీ ఉదయం 10గంటలకు ప్రారంభమయ్యే కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

జూలూరుపాడులో వర్షం

జూలూరుపాడు, మే 20: మండలంలోని పడమటనర్సాపురం, కొమ్ముగూడెం, మాచినేనిపేట, బేతాళపాడు, కాకర్ల గ్రామాల్లో సోమవారం వర్షం కురిసింది. వారం రోజుల నుంచి వర్షాలు కురుస్తుండడంతో రైతులు పొలం బాట పట్టారు.

26న ఛత్తీస్‌గఢ్ బంద్‌కు మావోయిస్టుల పిలుపు

కొత్తగూడెం క్రైం, మే 20: 'ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో బూటకపు ఎన్‌కౌంటర్లు, అక్రమ అరెస్టులను నిరసిస్తూ' ఈ నెల 26న బంద్‌కు మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చింది. ఈ మేరకు, ఆ పార్టీ సౌత్ సబ్ జోనల్ బ్యూరో సమత పేరుతో బీజాపూర్ జిల్లాలో సోమవారం కరపత్రం విడుదలైంది. అందులో ఇలా ఉంది- 'ఛత్తీస్‌గఢ్‌లో ఫాసిస్ట్ ఆపరేషన్ 'కగార్' పేరుతో జరుగుతున్న మారణకాండకు వ్యతిరేకంగా 26న బంద్‌ను విజయవంతం చేయాలి. ఇప్పటి వరకు మా పార్టీకి చెందిన 62 మంది పోలీస్ బలగాల కాల్పుల్లో మరణించారు. కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ఆదివాసీని సీఎంగా చేసి కీలుబొమ్మలా ఆడిస్తున్నారు'.

కస్టడీ నుంచి తప్పించుకున్న మావోయిస్టు

కొత్తగూడెం క్రైం, మే 20: పోలీస్ కస్టడీ నుంచి మావోయిస్టు తప్పించుకున్న ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతేవాడ జిల్లాలో సోమవారం చోటు చేసుకుంది. దంతేవాడ జిల్లా పోలీసులు నాలుగు రోజుల క్రితం యాంటీ నక్సల్స్ ఆపరేషన్‌లో భాగంగా దేవరం నుప్పో అనే మావోయిస్టును అదుపులోకి తీసుకున్నారు. అయితే అతడి ఆరోగ్యం క్షీణించడంతో చికిత్స అందించేందుకు పోలీసులు వైద్యశాలకు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నుప్పో తన వెంట కాపలా ఉన్న గార్డుతో మూత్ర విసర్జనకు వెళ్లి వస్తానని చెప్పి మరుగుదొడ్డి వైపు వెళ్లి అక్కడి నుంచి తప్పించుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటన అక్కడి పోలీస్ శాఖలో కలకలం సృష్టిస్తోంది. కాగా.. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను అధికారులు వెల్లడించాల్సి ఉంది.

కొత్తగూడెం వాసికి పురస్కారం

కొత్తగూడెం అర్బన్, మే 20: కొత్తగూడెం పట్టణానికి చెందిన కవి, చిత్రకారుడు రాజేష్‌కు అన్నమయ్య పురస్కారాన్ని చిత్తూరులోని సంప్రదాయ కళల పరిరక్షణ సంస్థ, తిరుపతిలోని ఏఎస్ ఫౌండేషన్ సంయుక్తంగా ప్రకటించాయి. చిత్రలేఖనం, సాహిత్య రంగాల్లో చేసిన కృషికి గుర్తింపుగా ఈ పురస్కారానికి రాజేష్‌ను ఎంపిక చేసినట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మడవలి చిరంజీవి, కార్యదర్శి పెంజేటి తిమ్మక్క తెలిపారు. ఈ మేరకు వారు ఆహ్వాన పత్రిక పంపారు. ఈనెల 26న చి త్తూరు జిల్లా బైరెడ్డిపల్లిలో జరిగే వేడుకలో పురస్కార ప్రదానం ఉంటుందన్నారు.

నీటి పారుదల శాఖ సూపరింటెండెంట్ మృతి

పాల్వంచ, మే 20: కొత్తగూడెంలోని నీటి పారుదల శాఖ సూపరింటెండెంట్ నంద్రు క్రాంతి(47) గుండెపోటుతో సోమవారం తెల్లవారురుఝామున మృతి చెందా రు. పోలీసులు తెలిపిన వివరాలు.. క్రాంతి, తన కుమారుడు రఘురాంతో కలిసి పాల్వంచ బాపూజీ నగర్‌లో నివసిస్తున్నారు. ఆమె రెండేళ్ల నుంచి ఆస్తమాతో బాధపడుతున్నారు. ఆదివారం రాత్రి తీవ్ర స్థాయిలో ఆస్తమా వచ్చింది. టాబ్లెట్ వేసుకుని పడుకున్నారు. తెల్లవారుజామున ఆమె లేవలేదు. కుమారుడు రఘురాం లేపేందుకు యత్నించినా స్పందన లేదు. దీంతో ఆమెను ఆస్పత్రికి తరలించాడు. వైద్యులు పరీక్షించి, అప్పటికే ఆమె గుండెపోటుతో మృతి చెందినట్లు చెప్పారు. పోలీసులు వివరాలు సేకరించి, కేసు నమోదు చేశారు. ఎస్సై రాము దర్యాప్తు చేస్తున్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

నిరుద్యోగులకు సువర్ణావకాశం
★ Training and Placements ...
BPO మరియు Software Companies లో నిష్ణాతులైన 15 సం॥ ల అనుభవం కలిగిన ఫ్యాకల్టీ చేత ట్రైనింగ్ ఇచ్చి ప్లేస్మెంట్ చూపించబడును. వివరాలకు సంప్రదించండి ॥. 7731948028
KMM

WANTED
★ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. Ph: 8977639662 / 8977639663.
NT-327714-All

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616